జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 22-5-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 346 పేజీలు: 4 వెల : రూ.7



## నేలకొరిగిన... ఉద్యమ కెరటం

*** ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్ * 27 మంది మావోయిస్టులు మృతి.. అగ్రనేత నంబాల కేశవరావు కూడా.. * గణపతి తర్వాత పార్టీ పగ్గాలు * ఐదు దశాబ్దాలు ఉద్యమంలోనే * చదువుకునే వయసులోనే నక్సల్బరీ ఉద్యమంలోకి * అలిపిరి దాడిలో ప్రధాన సూత్రధారి * కేశవరావు స్వగ్రామం జీఎన్‌పేటలో విషాదఛాయలు**

**శ్రీకాకుళం క్రైం, మే 21 (వార్త):** ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతో తుపాకీ పట్టి నక్సల్‌బరీ ఉద్యమంలో చేరిన సిక్కోలు ఉద్యమ కెరటం నేలకొరిగింది. ఐదు దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీలో దిగువస్థాయి నుంచి ఏకంగా కమాండర్ ఇన్ ఛీఫ్‌గా ఎదిగిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ అడవుల్లో పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు విడిచారు. సిక్కోలు జిల్లాకు చెందిన ఈ ఉద్యమ సింహం మృతి చెందడంతో ఆయన స్వగ్రామం కోటబొమ్మాళి మండలంలోని జీఎన్‌పేటలో విషాదం నెలకొంది. ప్రాథమిక విద్యను స్వగ్రామంలో, తలగాం హైస్కూల్‌లో ఎనిమిది, తొమ్మిది, పది తరగతులు, టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివారు. ఇంజనీరింగ్ కోసం వరంగల్‌లోని ఆర్ఈసీలో చేరారు. ఎంటెక్ చదువుతుండగా నక్సల్‌బరి ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. సాయుధ పోరాటమే ఊపిరిగా సుమారు 45ఏళ్లు అజ్ఞాత జీవనాన్ని గడిపారు. మొదటిగా సీపీఐఎంఎల్‌లో తూర్పుగోదావరి జిల్లా సభ్యుడిగా, రాష్ట్రకమిటీ సభ్యుడిగా, ఆ తరువాత మావోయిస్టు పార్టీలో కేంద్రకమిటీ సభ్యుడిగా ఎదిగాడు. 2018లో అప్పటి మావోయిస్టు కేంద్ర ప్రధానకార్యదర్శి లక్ష్మణరావు అనారోగ్యంతో రాజీనామా చేశారు. అనంతరం మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా కేశవరావు బాధ్యతలు స్వీకరించారు. కేశవరావు కొన్నాళ్లు ఎల్‌టీటీఈలో కూడా శిక్షణ పొందాడు. గెరిల్లా, మిలటరీ సాంకేతిక వ్యూహాల్లో దిట్ట.

### కుటుంబ నేపథ్యం..

జీయన్నపేటకు చెందిన వాసుదేవరావు, భారతమ్మ దంపతులకు 1955లో కేశవరావు జన్మించారు. తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు. తల్లి భారతమ్మ గృహిణి.



ఈయనకు ఇద్దరు సోదరులు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. పెద్దన్నయ్య ఢిల్లేశ్వరరావు, తమ్ముడు రాంప్రసాద్ విశాఖలో ఉంటున్నారు. ఒక సోదరి హనుమంతు ఉష విజయవాడలో ఉండగా.. మరో సోదరి జలజాక్షి మెళియాపుట్టి మండలం శేఖరాపురంలో నివసిస్తోంది. ఇంకో సోదరి సత్యవతి హైదరాబాద్‌లో ఉంటున్నారు.

### ఐదు దశాబ్దాలు ఉద్యమంలోనే..

సాయుధ పోరాటమే ఊపిరిగా సుమారు 45ఏళ్లు అజ్ఞాత జీవనాన్ని గడిపారు. ఉద్యమాల్లో చేరిన తర్వాత కేశవరావు స్వగ్రామానికి ఎప్పుడూ రాలేదు. గత ఏడాది అక్టోబరు 10న ఛత్తీసగఢ్ పరిధి అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేశవరావు మృతిచెందాడని ప్రచారం జరిగింది. అయితే దీన్ని పోలీసులు, మావోయిస్టులు ధ్రువీకరించలేదు. ఈసారి నారాయణపూర్ జిల్లా అడవుల్లో ఎన్‌కౌంటర్‌లో కేశవరావు మృతిచెందాడని తెలవడంతో జీయన్నపేటలో విషాదఛాయలు కనిపించాయి. ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావును బసవరాజు, క్రిష్ణ, వినయ్, గంగన్న, బసవరాజు, ప్రకాష్, బీఆర్, ఉమేష్, రాజు, విజయ్, కేశవ్, దారపు నరసింహారెడ్డి, నరసింహ అని మారు పేర్లతో కూడా పిలిచేవారు. 2018 నవంబర్‌లో ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి రాజీనామా తర్వాత అతను పార్టీకి సుప్రీం కమాండర్ అయ్యారు. కేశవరావు విషయమై కుటుంబీకులకు, గ్రామస్థులను అడిగితే ఆయన నక్సల్బరీ ఉద్యమంలో చేరిన తర్వాత గ్రామం వైపు రాలేదనే చెబుతున్నారు. అతడిని తామెన్నడూ చూడలేదని





పేర్కొంటున్నారు. మందస మండలం సింగుపురం సరిహద్దు అటవీ ప్రాంతంలో పోలీసులు కూంబింగ్‌కు వెళ్లగా మావోయిస్టులు ఎదురుకాల్పులు జరిపారు. అందులో కేశవరావు, మందస మండలం భిన్నలమదనాపురానికి చెందిన మార్పు వెంకటరమణ, వజ్రపుకొత్తూరు మండలం బాతుపురానికి చెందిన బాబూరావు ఉన్నారు. దీనికి సంబంధించి వారిపై 1999లో మందస పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రస్తుతం సోంపేట కోర్టులో విచారణలో ఉంది. 1992లో పీపుల్స్ వార్ పార్టీ కేంద్ర కమిటీలోకి అడుగుపెట్టి, 2004లో ఆ పార్టీ మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (ఎంసీసీ)తో విలీనం కావడంతో కొత్తగా ఏర్పడిన సీపీఐ (మావోయిస్టు)లో కీలక స్థానం పొందాడు. సెంట్రల్ మిలిటరీ కమిషన్ కార్యదర్శిగా ఉన్న బసవరాజు, దేశవ్యాప్తంగా అనేక ఆపరేషన్లకు సూత్రధారి. 2010లో ఛత్తీస్‌గఢ్ దంతెవాడలో 76 మంది సీఆర్పీఎఫ్ జవాన్ల మృతి, 2013లో జిరమ్ ఘాటిలో కాంగ్రెస్ నేతలపై దాడి... ఇవన్నీ ఆయన వ్యూహాలతోనే జరిగాయని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. బసవరాజును ఎక్కడా స్పష్టంగా చూడలేకపోవడం వల్ల భద్రతా సంస్థలు 'ఘోస్ట్ కమాండర్'గా వ్యవహరించేవి. ఇటీవల వరకూ ఆయన తాజా ఫొటోలు ఎవరికీ అందుబాటులో లేకపోవడం, ఎప్పటికప్పుడు మారుతున్న మారుపేర్లతో వ్యవహరించడం భద్రతా బలగాలకు తలనొప్పిగా మారింది. ఆయన అసలు నివాసమైన జియ్యన్నపేట గ్రామంలో ఆయన పేరిట ఆస్తి లేదు. 1980 తర్వాత నుంచి స్వగ్రామానికి అడుగుపెట్టలేదనే చెప్పవచ్చు. 1987లో బస్తర్ అడవుల్లో తమిళనాడు ఎల్టిటిఈ మాజీ యోధుల చెంత శిక్షణ పొందిన బసవరాజు, జెలటిన్ బాంబులు, గెరిల్లా వ్యూహాల్లో నిపుణత సాధించాడు. మిలిటరీ కమిషన్ చీఫ్‌గా మావోయిస్టు దళాల ఆధునీకరణ, టెక్నాలజీ వినియోగంపై దృష్టి సారించాడు. కాగా, కేశవరావు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు గ్రామస్థులు కొందరు ఛత్తీస్‌గఢ్ బయలుదేరి వెళ్లారు. అంత్యక్రియలు జియ్యన్నపేటలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

## నిరాడంబరంగా ధర్మాన జన్మదిన వేడుకలు

**శ్రీకాకుళం, మే 21 (వార్త):** సీనియర్ రాజకీయ నేత, మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన సోదరుడు, రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, శ్రీకాకుళం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రంలోని గోపాల్‌పూర్ బీచ్ వద్ద ఉన్న మేఫియర్ హోటల్‌లో పార్టీ ముఖ్య శ్రేణి నేతలు, ధర్మాన ప్రసాదరావు సతీమణి గజలక్ష్మి సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా తమ్ముడికి స్వయంగా కేక్ తినిపిస్తూ, ఆనందాన్ని పంచుకున్న కృష్ణదాస్, తన అనుబంధాన్ని చాటారు. పార్టీ నేతలు ధర్మాన ప్రసాదరావుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, కృష్ణ చైతన్య, మామిడి శ్రీకాంత్, అందవరపు సూరిబాబు, మండవల్లి రవి, కోణార్క్ శ్రీను, శిమ్మ రాజశేఖర్, చింతాడ రవికుమార్, పేరాడ తిలక్, ధర్మాన రాందాస్, దుంగ సుధాకర్, తంగుడు నాగేశ్వరరావు, చల్ల శ్రీను, బలగ ప్రకాష్, అంబటి శ్రీను, మెంటాడ స్వరూప్, మహేందర్, గేదెల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.







జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రోడ్డు వేశారు.. మట్టి మరిచారు..!

**సరుబుజ్జిలి, మే 21(వార్త):** సరుబుజ్జిలి నుంచి వెన్నెల వలస నవోదయ స్కూల్ వెళ్లే రహదారికి సీసీ రోడ్డు వేసి నెలలు గడుస్తున్నా.. ఆ రోడ్డుకు ఇరువైపులా మట్టిని వేయడం మరిచిపోయారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే వెళ్లడానికి దారిలేక ముళ్ల కంపలు, బురదలో చిక్కుకుపోయి ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. ఆ సమయంలో ఈ రోడ్డుపై వెళ్తున్న ఆ ట్రాక్టర్ బోల్తా పడింది. రోడ్డు వేసి ఆరునెలలు పైగా అవుతున్నా, మట్టిని వేయకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డుకు ఇరు వైపులా మట్టి వేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# ఘనంగా మినీ మహానాడు



**ఆమదాలవలస, మే 21(వార్త):** ఆమదాలవలసలో తెలుగుదేశం మినీ మహానాడు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ తెలుగువాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా పుట్టిన పార్టీ, పేద ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించే పార్టీ, బడుగు బలహీన వర్గాల కోసం ప్రతి క్షణం తపించే గొప్ప పార్టీ తెలుగుదేశం మాత్రమే అన్నారు. తెలుగుదేశం పార్టీ లక్ష్యాలను, ఆదర్శాలను ప్రజల్లోకి మరింత ఉత్తేజంతో తీసుకెళ్లేందుకు మహానాడు, మినీ మహానాడు ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు కార్యక్రమంలో తెదేపా పార్టీలో రాష్ట్రస్థాయిపదవులు అలంకరించిన నియోజవర్గానికి సంబంధించిన ముఖ్య నాయకులకు సన్మానం చేశారు. నందమూరి తారక రామారావుకు సంబంధించిన శ్రీ నందమూరి శతకం పుస్తకావిష్కరణ జరిపారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యం, మార్క్‌ఫెడ్ స్టేట్ డైరెక్టర్ అనేపు రామకృష్ణ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, స్టేట్ అబ్జర్వర్ టీ చంద్రశేఖర యాదవ్, నారాయణపురం ప్రాజెక్ట్ చైర్మన్ సనపల ఢిల్లీ, మండల అధ్యక్షులు నూకరాజు, మాజీ చైర్‌పర్సన్ గీత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మొదలవలస రమేష్, మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షులు సంపతిరావు మురళి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు, బూర్జ మండల అధ్యక్షుడు రాంజీ, సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు అంబాల్ల రాంబాబు, పొందూరు మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, తెలుగు జిల్లా మహిళ అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, అన్ని క్లస్టర్, యూనిట్,బూత్ ఇన్చార్జిలు, బూత్ ఏజెంట్లు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువత, ప్రజలు పాల్గొన్నారు.



## కొత్తూరులో నేత్ర వైద్య శిబిరం

**కొత్తూరు, మే 21(వార్త):** కొత్తూరు గ్రామ పంచాయతీలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం జిల్లా అందత్వ నివారణ సమస్త సహకారం తో మరియు జెమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర చికిత్స శిబిరంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిసర గ్రామాల నుంచి సుమారు 58 మంది కంటి రోగులకు పేరామెడికల్ ఆప్తల్మిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేయగా 20 మందిని కంటి ఆపరేషన్ కి ఎంపిక అయ్యారు. వీరికి రాగోలు జెమ్స్ హాస్పిటల్ కి పంపించడం జరిగింది. రోగులకు ఉచితంగా ఆపరేషన్, భోజనం, మందులు, ప్రయాణం సౌకర్యం కల్పించడం జరిగింది.

## నిధుల దుర్వినియోగంపై ఆగ్రహం



**మందస, మే 21(వార్త):** మందస మండలంలోని లోహరిబంద సచివాలయం పరిధిలో జరిగిన నిధుల దుర్వినియోగంపై తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీ అభివృద్ధికి సచివాలయం సిబ్బంది సహకరించాలని పిలుపునిచ్చారు. లొహరిబంద సచివాలయం లో అధికారులు, సిబ్బందితో పంచాయతీ సమస్యలుపై టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు నాయకత్వంలో చర్చలు జరిపారు. లొహరిబంద పంచాయతీలోని గ్రామాలలో అపారిశుధ్యం తాండవిస్తోందని, విద్యుత్ అసౌకర్యం, అధికారుల సమయపాలన, సచివాలయంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పంచాయతీ నిధుల వినియోగం పై వివరణ కోరారు. పంచాయతీ అభివృద్ధి కి తెలుగుదేశం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు పరచడంలో ప్రజలకు సహకరించాలని, అవినీతికి పాల్పడితే సహించేది లేదని పేర్కొన్నారు. సమావేశం బద్రి కోదండరావు, అందాల మోహనరావు, అందాల వాసు, జోగ జానకిరావు, పిన్నింటి జోగారావు, అందాల రామారావు, ఊళ్ల శంకర్, ముదిమించి ఈశ్వర్రావు, పిన్నింటి శంకర్, సాలిన గోవింద్, కొరికాన మాధవరావు పాల్గొన్నారు.

# ఎండీయు ఆపరేటర్లను తొలగించడం తగదు



**శ్రీకాకుళం, మే 21(వార్త):** నిరంతం ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్న ఎండీయు ఆపరేటర్లను తొలగించడం తగదని ఎండీయు ఆపరేటర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రౌతు సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ఎన్‌జీవో హోంలో బుధవారం ఎండీయు ఆపరేటర్ల నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 9,260 ఎండీయు ఆపరేటర్లు, 9,200 సహాయకులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరు విధుల్లో చేరిన సమయంలో 72 నెలల అగ్రిమెంట్ ఉందని, ప్రస్తుతం మరో రెండేళ్ల పాటు విధుల్లో కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం రాత్రిరాత్రికి అనాలోచిత నిర్ణయంతో ఆపరేటర్లను తొలగించడం సమంజసం కాదని తెలిపారు. ఇటువంటి నిర్ణయాల వలన సుమారు 18,500 కుటుంబాలు రోడ్డున పడతామయని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కష్టకాలంలో కూడా ఒక్కో ఆపరేటర్ 1500 వందల నుంచి 2000 ఇళ్లకు వెళ్లి తమ ప్రాణాలను పణంగా పెట్టి నిత్యవసర సరుకులను అందజేశారని చెప్పారు. తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించే దిశగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఒక్కో ఆపరేటర్‌కు గదా రెండు సంవత్సరాల కాలంగా రావలసిన అంగనవాడి మిడ్ డే మీల్స్ అమౌంట్ని వెంటనే రిలీజ్ చేయాలని, 9,500 పై చిలుకు కట్టిన ఇన్సూరెన్స్ అమౌంట్ రావల్సి ఉందని ఆ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. అలాగే బ్యాంకుల ద్వారా 1,90,000 రూపాయలు బకాయిలు ఈఎంఐల ద్వారా చెల్లించాల్సి ఉందని వాటిని ప్రభుత్వమే చెల్లించాలని చెప్పారు. తమను తప్పనిసరిగా తొలగించాల్సి వస్తే కార్మిక చట్టం ప్రకారం ఆరు నెలల జీతాలను ముందే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షలతో బడుగు బలహీన వర్గాలకు ఇచ్చిన ఈ వెహికల్స్ ద్వారా జీవనోపాధి సాగిస్తున్న మాపై కక్ష సాధింపు తగదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే 26 జిల్లాల్లోని కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహిస్తామని, కుటుంబాలతో సహా కలెక్టరేట్లను ముట్టడి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఎండీయూ ప్రతినిధులు హేమ సుందర్, వరహా నరసింహులు, వెంకట్రావు, అప్పలనాయుడు, రవి, వాసు, గోపి, రామారావు, కిట్టు, శ్రీను, మాధవ్, దివాకర్, కిషోర్, వరుణ్, కిరణ్, గోవిందరాజు, అనిల్, గణేష్, శంకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న జ్యోషిత

**మందస, మే 21(వార్త):** రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఉండవల్లి నివాసంలో ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రభుత్వ పాఠశాలలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు 597 మార్కులతో ఎస్ఎస్సీ రాష్ట్ర రెండవ ర్యాంక్ సాధించిన మందస మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్, హరిపురం విద్యార్థిని కంచరాన జ్యోషిత తో బాటు 47 పాఠశాలల విద్యార్థులకు సైనింగ్ స్టార్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జ్యోషితకు మంత్రి లోకేశ్ దుశ్శాలువ తో సత్కరిస్తూ, బంగారు పతకం, వింగ్స్ అఫ్ ఫైర్ , అటామిక్ హ్యాబిట్స్ వంటి విలువైన 9 పుస్తకాలతో ఒక కిట్టును అందజేశారు. లక్ష్యసాధనకు కష్టపడే తత్వం ఉంటే తప్పక విజయం సాధిస్తామని తన జీవితంలోని ఎదుర్కొన్న సన్నివేశాలతో మేళవింపు చేస్తూ తెలిపారు. పిల్లలు విజయం పట్ల తల్లిదండ్రుల యొక్క ప్రోత్సాహం ప్రధానమైనదని వారి కృషిని మరువలేమని కొనియాడారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, నాణ్యత తో కూడిన విద్య ను ప్రైవేటు పాఠశాలలు అందుకోలేని స్థితికి చేర్చడానికి కృషి చేస్తున్నామన్నారు. మారుమూల ప్రాంతాలలో చదువుతూ అత్యున్నత మార్కులు సాధించి మిగిలిన విద్యార్థులకు ప్రేరణ కలిగించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, పలువురు సీనియర్ ప్రభుత్వ అధికారులు, జ్యోషిత తల్లిదండ్రులు కంచరాన మాధవరావు, లేపాక్షి పాల్గొన్నారు.



# పిల్లల విజయంలో తల్లిదండ్రుల బాధ్యత కీలకం





**శ్రీకాకుళం, మే 21(వార్త):** పిల్లల విజయంలో తల్లిదండ్రులదే కీలక బాధ్యత అని జనసేన నాయకులు, ప్రముఖ గైనిక్ వైద్యనిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని పాలకొండరోడ్డులోని రాయల్ ప్లాజా ఫంక్షన్ హాల్‌లో బుధవారం చైతన్యదీపిక యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారి ప్రపంచం బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులను అన్ని రంగాల్లోనూ తల్లిదండ్రులు ప్రోత్సహించాలని చెప్పారు. పిల్లలను వారి చిన్నతనం నుంచే ఎంచుకున్న రంగంలో రాణించేలా వారిని వెన్నుతట్టాలన్నారు. తాను ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఉన్నతస్థాయిలో నిలిచానని ఆ విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలంటే తనకెంతో ఇష్టమని చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న నిరుపేద చిన్నారులకు ప్రతీ ఏడాది జూన్ 1న రూ.10వేలు అందజేస్తానని చెప్పారు. వారి చదువు పూర్తయ్యే వరకు ఈ ప్రోత్సాహం అందజేయనున్నట్టు వివరించారు. టీడీపీ తెలుగుమహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ పిల్లలను వారి ఆసక్తి, అభిరుచికి అనుగుణంగా ఆయా రంగాల్లో ప్రోత్సహించాలని చెప్పారు. నేటి బాలలే రేపటి పౌరులని కొనియాడారు. అనునిత్యం ప్రజాహిత కార్యక్రమాలు అందించడంలో చైతన్యదీపిక దినపత్రిక యాజమాన్యం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఒకవైపు జర్నలిజంలో బీజీగా ఉంటూనే సమాజ హిత కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు రావడం గొప్ప విషయమని కొనియాడారు. చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికి తీసి వారి ప్రతిభను గుర్తించేలా చిన్నారి ప్రపంచం కాంటెస్ట్ నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు గంజి ఆర్ ఎజ్రా మాట్లాడుతూ చైతన్యదీపిక యాజమాన్యం అనడం కన్నా వీరిని నగరంలో ఎక్కువ మంది త్రిమూర్తులని పిలుస్తుంటారన్నారు. ఒక్కొక్కరు ఒక్కో రంగంలో నిష్ణాతులని కృష్ణ, మణి, సాయి అంటే అటు ప్రజాప్రతినిధుల్లోనూ, ఇటు అధికారుల్లోనూ, ప్రజల్లోనూ మంచి గౌరవభావం ఉందని చెప్పారు. వారు విలువలతో కూడిన జర్నలిజం చేస్తూ యువ జర్నలిస్టులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. అనంతరం డాక్టర్ బస్వా శ్రీనివాసరరెడ్డి (ట్రాఫిక్‌జామ్ శ్రీను)ను దుశ్శాలువతో ఘనంగా సత్కరించి మెమొంటోను అందజేశారు. అనంతరం విజేతలకు మొమెంటో, మెడల్, సర్టిఫికేట్లను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందించారు. భవిష్యత్‌లో చైతన్యదీపిక యాజమాన్యం మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించాలని వక్తలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాయితీ చంద్రశేఖర్, విద్యాకమిటీ చైర్మన్ ఖండవిల్లి సిద్ధార్థ, మణిశర్మ, ఈశ్వరరావు, సాయిబాబా, నవీన్, విజయ్‌లు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



**శ్రీకాకుళం, మే 21(వార్త):** ప్రతి మనిషి జీవితంలో మంచి ఆరోగ్యపు అలవాట్లు, నడవడిక, సంపూర్ణ ఆరోగ్యం.. యోగ ద్వారా సాధ్యమవుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర పేరుతో నెలరోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవాలయం అనివెట్టి మండపంలో ఈ కార్యక్రమాలను బుధవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యోగ ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం, మానసిక ఒత్తిడి తగ్గి మానసిక ఉల్లాసం కలుగు తాయని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామమని తెలిపారు కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



## హరిపురం వద్ద 'ధర్మాన' జన్మదిన వేడుకలు

**-శుభాకాంక్షలు తెలిపిన సీదిరి**

**మందస, మే 21(వార్త):** మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు జన్మదినం సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మందస మండలంలోని హరిపురంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ధర్మాన ప్రసాదరావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ధర్మానకు తినిపించగా, ఆయన కూడా సీదిరికి కేక్ తినిపించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హ్యాపీ బర్త్ డే టు యూ సార్ అంటూ ఆనందోత్సవాల మధ్య నినాదాలు చేశారు. అనంతరం పార్టీ పరిస్థితిని వారు చర్చించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, టెక్కలి నియోజకవర్గం ఇన్‌చార్జి పి.తిలక్, పలాస నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



**మందస, మే 21(వార్త):** కూటమి ప్రభుత్వం ఇచ్చిన రైతులకు హామీలు నెరవేర్చాలని రైతాంగ సమస్యలు సాధన కమిటీ డిమాండ్ నాయకులు డిమాండ్ చేశారు. పలాస నియోజకవర్గం రైతాంగ సమస్యలు సాధన కమిటీ అధ్యక్షుడు మామిడి మాధవరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలు చర్చించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరము అయినప్పటికీ ఎన్నికల సమయంలో జీడి రైతులకు జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని, గిట్టుబాటు ధర కల్పించి రైతులకు మేలు చేస్తామని ఇచ్చిన నెరవేర్చకపోవడం దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వం జీడిపిక్క 80కేజీలకు రూ.16వేలకు, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, వంశధార నాదీజలాలు పంటలు సాగుకు బొడ్డపాడు వేపాడు చెరువు మీదుగా, సంకుజోడు, దామోదర సాగర్, సునాముది కలుపుకొని ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని, కిడ్నీ సమస్యలతో ఉద్దాన గ్రామాలలో ప్రజలు చనిపోతున్నా, నివారణకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో కృషి చేయడం లేదని, తక్షణమే మరణాలను ఆపడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏళ్ల తరబడి చెరువులలో పూడికలున్నాయని, వాటిని తొలగించి చానళ్ళు మరమ్మత్తు చేపట్టాలన్నారు. తితిలి తుఫాన్ తో సర్వము కోల్పోయిన ఒక్క పైసా కూడా అందని రైతులకు నష్టపరిహారం తక్షణమే అందేటట్లు చేయాలని, పచ్చని చెట్లతో ఉధ్యానవనము వలే రైతన్నలకు ఆహ్లాదాన్ని అందిస్తు రైతులకుకడుపునింపుతూ పిల్లలు పెళ్లిళ్లుకు, చదువులకు భరోసాగా నిలుస్తున్న తోటలలో కార్గో విమానాశ్రయము పేరుతో కార్పొరేట్లకు కట్టబెట్టాలనే ప్రయత్నం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతాంగ సమస్యలు సాధన కమిటీ నాయకులు గొర్లె చలపతి, దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచన, సింహాద్రి, దుర్యోధన, మజ్జి బాబూరావు, నల్ల హడ్డి, సోమనాదము, ముకుందరావు, నారా యణ, కొమర వాసు, గుంటు లోఖనాదం, విరాశ్వాము, కొర్ల హేమారావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## మైక్రో క్రెడిట్ ప్లాన్ పక్కాగా అమలు జరగాలి

**మందస, మే 21(వార్త):** రాష్ట్ర పేదరిక నిర్మూలనా సంస్థ (సేర్ప్) మార్గదర్శకాలకు అనుగుణంగా, ఈ ఏడాది మహిళా సంఘాల వార్షిక రుణ ప్రణాళికలో మైక్రో క్రెడిట్ ప్లాన్ పక్కాగా అమలు జరగాలని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. బుధవారం మందస మండల పరిధిలోగల కొత్తపల్లి పంచాయతీ ముకుందాపురం గ్రామం పుస్తక నిర్వహణలో సభ్యురాలు వారి సూక్ష్మ రుణ ప్రణాళికను పరిశీలిస్తూ , సంఘ సభ్యుల అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మైక్రో క్రెడిట్ ప్లాన్ తయారు చేసినప్పుడు సభ్యుల బయోమెట్రిక్ ను కూడా తీసుకోవాలని తెలిపారు.అన్ని సంఘాలకు ప్రతినెలా మీటింగు జరిగే ప్రదేశాన్ని జియో ఫెన్సింగ్ చేయించాలని, సభ్యుల హాజరు కొరకు ముఖ నమోదును ఫేసువల్ యాప్ లో నమోదు చేయాలని సూచించారు. వార్షిక రుణ ప్రణాళికలో సభ్యులు బ్యాంకు నుండి తీసుకున్న రుణాలలో కనీసం 70 శాతం ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని అవగాహన కల్పించారు. యాక్టివిటీ చేస్తున్న మహిళలకు డాక్యుమెంటేషన్ చేయించి వ్యక్తిగతంగా ఉమెన్ లెడ్ ఎంటర్ప్రైజెస్ రుణాలను బ్యాంకుల ద్వారా మంజూరు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘాల ప్రతినిధులతో పాటు వి.వో.ఏ. బాడ చంద్రకళ, క్లస్టర్ కోఆర్డినేటర్లు బాలకృష్ణ, తారక్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# జూన్ 21 వరకు యోగాంధ్ర

**-గ్రామ స్థాయి నుంచీ పెద్ద ఎత్తున పాల్గొనాలి**

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపు**



**శ్రీకాకుళం, మే 21(వార్త):** గ్రామ స్థాయి నుండి పెద్ద ఎత్తున యోగాలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. జూన్ 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడి విశాఖపట్నం రానున్నారు. బుధవారం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవాలయంలో కర్టనరైజర్ యోగా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో పెద్ద ఎత్తున నిర్వహించ తలపెట్టిన యోగా కార్యక్రమం విజయవంతం అయ్యేదిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్రా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. యోగాంధ్రా కార్యక్రమాలు గ్రామ స్థాయి నుండి జరుగుతాయని, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం వద్ద యోగాంధ్రా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, రథసప్తమి వేడుకలను కర్టనరైజర్‌గా దేవస్థానం నుండి ప్రారంభించిన వేడుకలు విజయవంతం అయినట్లు వివరించారు. యోగాంధ్రా కార్యక్రమం కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నేటి నుంచి 21 జూన్ వరకు గ్రామ, మండలం, మున్సిపాలిటీలలో జరుతుంటాయని, వీరికి ఒక యోగా టీచర్ శిక్షణ ఇస్తారన్నారు. ప్రతీ ఒక్కరూ యోగా పై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా, క్విట్ ఆంధ్ర ఉద్యమంలా యోగాను తీసుకువెళ్లాలన్నారు. ప్రతీ ఒక్కరూ యోగాంధ్రా వెబ్ సైట్ లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ట్రేలర్ ఈ వారం రోజులు జిల్లా స్థాయిలో, వచ్చే వారం రోజులుగా మండల స్థాయిలో, మూడవ వారం గ్రామ స్థాయిలో ఉంటుందన్నారు. యోగా పై డిబేట్, వ్యాసరచన, తదితర పోటీలు ఉంటాయన్నారు. పర్యాటక ప్రాంతాలు, బీచ్ లో యోగా కార్యక్రమం ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. అందరూ కుటుంబాలతో యోగాలో పాల్గొనాలన్నారు. నేటి నుండి నెల రోజులు పాటు యోగా కార్యక్రమాలు ఉంటాయన్నారు. యోగా పై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎపిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్ పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమాలు గ్రామ స్థాయి నుండి నిర్వహించడం జరుతుందన్నారు. అరసవల్లి ఉత్సవాలు కర్టనరైజర్ అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం నుండి ప్రారంభించి విజయవంతం చేసినట్లు చెప్పారు. యోగాంధ్ర ను ఇక్కడ నుండే ప్రారంభిస్తున్నామన్నారు. ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యోగా కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ఆన్‌లైన్‌లో తమ పేరు నమోదు చేసుకోవాలని చూస్తున్నారు. కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత, యోగా టీచర్లు పాండ్రంకి మురళి కృష్ణ, తంగి స్వాతి, ఎ. గాయత్రి, రామారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను నివారించాలి: ఎస్పీ





**శ్రీకాకుళం, మే 21(వార్త):** జాతీయ రహదారిలో ప్రత్యేక కార్యాచరణతో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సూచించారు. బుధవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో హైవే పెట్రోలింగ్ సిబ్బంది, హైవే పోలీసు స్టేషన్ సంబంధిత పోలీసు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైవే పెట్రోలింగ్ వాహనాలు తిరిగే ప్రదేశాలు, సిబ్బంది, వారి విధి విధానాలు తదితర అంశాలపై ఆరా తీశారు. రహదారిపై నేరాలు ప్రమాదాలను నివారించడం, ప్రయాణికులకు సహాయం అందించడం, హైవే పెట్రోలింగ్ సిబ్బంది ముఖ్యమైన విధి అన్నారు. వాహనాల నిర్వహణ (మెంటెనెన్స్) సక్రమంగా ఉండాలన్నారు. రోడ్డుకు ఇరువైలా లారీలు, ఇతర భారీ వాహనాలు పార్కింగ్ లేకుండా చూడాలని, కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేసేలా చూడాలన్నారు. సర్వీస్ రోడ్డు మార్గంలో వాహనాలు వ్యతిరేక దిశలో (రాంగ్ రూట్) వచ్చే వాహనాలు నియంత్రించాలని తెలిపారు. హైవే మార్గంలో దాబా, హొటల్ నిర్ణీత సమయానికి క్లోజ్ చేయించాలన్నారు. వేకువజామున సమయంలో టోల్ ప్లాజ్, చెక్ పోస్టులు వద్ద వాహన చోదకులకు నిరంతరం ఫేష్ వాష్ కార్యక్రమం జరిపించాలని పేర్కొన్నారు. ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా ప్రమాద హెచ్చరిక,మలుపు,అతి వేగాం నియంత్రణ సూచిక బోర్డులు,స్టాపర్స్ సోలార్ బ్లింకర్స్ నిర్వహణ సక్రమంగా ఉండేలా హైవే అథారిటీ వారి సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు.విధుల్లో ఉన్న సిబ్బంది రేడియం జాకెట్లు తప్పక దరించాలని ఆదేశించారు. రోడ్లపై ట్రాఫిక్ క్రమబద్ధంగా నిర్వహించడం, ట్రాఫిక్ జామ్లను నివారించడం వంటివి హైవే పెట్రోలింగ్ సిబ్బంది బాధ్యతగా నిర్వర్తించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలను జరిగే సమయంలో వెంటనే ప్రమాద ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు, క్షతగాత్రులను దగ్గరలో హాస్పిటల్‌కు 108 అంబులెన్స్ సహకారంతో తీసుకువెళ్లాలని తెలిపారు. రోడ్డుపై ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే,హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే స్పందించి సహాయం అందించాలన్నారు.హైవే పెట్రోలింగ్ సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిని గుర్తించి రహదారి భద్రత నియమాలు పై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు సిహెచ్ వివేకానంద్, ఎం.వి.అప్పారావు, సీఐలు పైడిపు నాయడు, అవతారం, శ్రీనివాస్, విజయకుమార్, తిరుపతిరావు, శ్రీనివాసరావు, జె.శ్రీనివాస్, ఆర్ఐ కె.నర్సింగ రావు, ఎస్సైలు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటింటికీ రేషన్ పంపిణీకి బ్రేక్‌తో పేదలకు ఇక్కట్లు

**-మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆగ్రహం**

**కొత్తూరు, మే 21(వార్త):** ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పంపిణీ పథకాన్ని రద్దు చేయడం ద్వారా నిరుపేదల నోటికాడ కూడు లాగేసిందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించిన ఇంటింటికి నాణ్యమైన బియ్యం పంపిణీ పథకం పేదలకు ఆహార భద్రత కల్పించడంలో ఒక మంచి ముందడుగు అని ఆమె అన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులు తమ ఇంటి వద్దకే నాణ్యమైన బియ్యాన్ని పొందడం, మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించడం వంటి ప్రయోజనాలు పొందారని ఆమె గుర్తు చేశారు. పేదవారికి గౌరవం ఇవ్వాలని, పెత్తందారితనం నుంచి దూరం చేయాలని జగనన్న సంకల్పిస్తే, కూటమి పాలనలో ఇప్పుడు మళ్ళీ రేషన్ డీలర్ ఇంటికి వెళ్లి తీసుకోవడం అంటే పెత్తందారితనాన్ని పెంచడమేనన్నారు. జగనన్న ఎంతో చక్కనైన నాణ్యమైన బియ్యం ఇంటింటికి పంపిణీ చేస్తే, ఈ కార్యక్రమం కేవలం జగనన్న కీర్తి ప్రతిష్టలు ఇంకా జనాల్లో మరింత ఉన్నాయని తెలిసి పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆమె ఆరోపించారు.ఈ పథకాన్ని నిలిపివేయడం లేదా నిర్వీర్యం చేయడం అనేది పేదల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయడమే అని ఆమె పునరుద్ఘాటించారు. ఆహార భద్రత అనేది ప్రాథమిక అవసరం అని, దీనిని అడ్డుకోవడం సమంజసం కాదని అన్నారు. ఇంటి వద్దకే బియ్యం అందడం వల్ల వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో ఉన్నవారు మరియు రవాణా సౌకర్యాలు లేని వారికి ఎంతో సౌకర్యంగా ఉండేదని ఆమె గుర్తు చేశారు. ఈ పథకం నిలిపివేయడం వల్ల వీరంతా మళ్ళీ రేషన్ షాపులకు వెళ్లి బియ్యం తెచ్చుకోవాల్సి వస్తుందని, ఇది వారికి అదనపు భారం మరియు అసౌకర్యం అని ఆమె వివరించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా, వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం చేపట్టిన మంచి పనులను కూడా నిలిపివేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చే పథకాలను రద్దు చేసేటప్పుడు, ప్రభుత్వాలు పారదర్శకతతో వ్యవహరించాలని ఆమె డిమాండ్ చేశారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

**ఇచ్ఛాపురం, మే 21(వార్త):** శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్ లోడ్ చేసుకోవాలని, మహిళలు తప్పనిసరిగా యాప్ కలిగి ఉండాలని రూరల్ ఎస్ ఐ శ్రీనివాస రావు అన్నారు. ముచ్చింద్ర లో సంకల్పం అహగహన సమావేశం నిర్వహించారు.రహదారి భద్రతా పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువత పాల్గొన్నారు.



# జీడికి గిట్టుబాటు ధరపై ఇచ్చిన హామీ అమలు చేయాలి



**పలాస, మే 21(వార్త):** జీడి పిక్కలు 80 కేజీల బస్తా కు 16 వేలు ధర కల్పించి ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాలు ద్వారా కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి వెంటనే ప్రకటన చేయాలని ఏ పి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె మోహన రావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ లు డిమాండ్ చేశారు.

బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలోజీడి రైతు సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన పత్రిక విలేఖరుల సమావేశంలో ఈ మేరకు డిమాండ్ చేశారు. జీడికి గిట్టుబాటు ధర, జీడి కార్పొరేషన్ ఏర్పాటు పై ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు.

ఎన్నికలలో వాగ్దానం చేసి సంవత్సరం కావస్తున్నా ఇచ్చిన హామీ నెరవేరలేదని అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చన్నాయుడు అన్ని పంటలకు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు ఇటీవల ప్రకటన చేశారని, అందులో జీడి పంటపై ఎటువంటి అభివృద్ధి చర్యలు చేపడతారో లేక పోవడం విడ్డురంగా ఉందని అన్నారు.

విదేశీ పిక్కలు దిగుమతి వల్ల స్థానిక పిక్కలు కొనుగోలు విషయంలో దళారులు, వ్యాపారులు రైతులను దగా చేస్తున్నారని, అందుకే స్థానిక పిక్కలు కొనుగోలు చేసిన తరువాతనే విదేశీ పిక్కలు దిగుమతికి అనుమతివ్వాలని కోరారు.జీడి పంటని వాణిజ్య పంటగా చెప్పి గిట్టుబాటు ధర పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉన్నాయని అన్నారు. అందుకే జీడి పంటను కేంద్ర మద్దతు ధరల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

గత మూడు నాలుగు సంవత్సరాలనుండి జీడి రైతంగం ఆందోళన చేస్తున్నా గత ప్రభుత్వం గాని, ప్రస్తుత ప్రభుత్వం గానీ జీడి రైతుల సమస్యలు పట్టించుకోక పోవడం చొచనీయమని అన్నారు. ప్రస్తుత పాలకులు మా ప్రభుత్వం వస్తే జీడికి గిట్టుబాటు ధర, జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పిన మాట తుంగలో తొక్కేశారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా జీడి కి గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ నెల చివరి వారం నుండి దశలవారి పోరాటానికి జీడి రైతంగాన్ని సన్నద్ధం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో జీడి రైతు సంఘం నాయకులు బత్తిని లక్ష్మీనారాయణ,టి రాజు, డి తారకేశ్వరరావు, జె సంతోష్, టి తాతరావు, సీఐటీయూ నాయకులు ఎన్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

# ఐటీఐ ఉపాధి అవకాశాలకు వారధి

**-పారిశ్రామిక శిక్షణా కేంద్రాల్లో ప్రవేశా లకు తొలి దశ నోటిఫికేషన్ విడుదల**

**-వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లకు 24 తుది గడువు**

**పలాస, మే 21(వార్త):** పదవ తరగతి పరీక్షలు పూర్తయి ఫలితాలు కూడా వచ్చాయి. ఇప్పుడు విద్యార్థులు పది అనంతర కోర్సులపై దృష్టి కేంద్రీకరించారు. ఇప్పటికే పాలిసెట్, ఏపీ ఆర్జీ సి రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్షలు పూర్తయ్యాయి. పలువురు విద్యార్థులు వారి ఆసక్తిని బట్టి ఏ కోర్సులో చేరాలా అని ఆలోచన చేస్తున్నారు. అధిక శాతం మంది విద్యార్థులు ఇంట ర్మీడియెట్లో చేరగా, పలువురు విద్యార్థులు పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులకు ప్రాధాన్యమిస్తు న్నారు. పదవ తరగతి పూర్తి చేయగానే త్వరితగతిన ఉపాధి పొందేందుకు ఐటీఐ కోర్సులు ఒక చక్కని బాటను ఏర్పాటు చేస్తాయని సాంకేతిక నిపుణులు చెబుతారు. ఐటీఐ కోర్సు పూర్తి చేసినవారు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఒక చక్కటి అవకాశంగా భావించవచ్చు. ఉద్యోగం, ఉ పాధితో పాటు స్వయం ఉపాధికి సైతం ఐటీఐ కోర్సు దోహదపడు తుంది. జిల్లాలో ప్రభుత్వ మరియు ప్రయివేట్ ఐటీఐ కళాశాలలో ఏడాది, రెండేళ్ల కాలపరిమితితో సీట్లు ఉంటాయి. ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 24వ తేదీ తుది గడువుగా ఉపాధి, శిక్షణ శాఖ ప్రకటించింది.

### రెండేళ్ల వ్యవధి గల కోర్సులు

ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్ సివిల్, ఆర్అండ్ ఏసీ టెక్నాలజీ, మెకానికల్ మోటార్ వెహికల్, ఎల కానిక్ మెకానిక్...

### ఏడాది కాలపరిమితి కోర్సులు..

మెకానిక్ డీజిల్, వెల్డర్, కోపా... గ్రూపులు ఉన్నాయి.

### ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ఐటీఐలో చేరగోరే విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోగా ఆన్లైన్ లో దరఖాస్తు చేసు కోవాలి. దరఖాస్తు పరి శీలన సమయంలో సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా హాజరు కావాలి. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను విద్యార్థుల మొబైల్కు పంపిస్తాం. పదవ తరగ తిలో విద్యార్థి పొందిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్స్ ఉంటాయి. పలాస ప్రభుత్వ ఐటిఐ లో చేరిన విద్యార్థులు ఒక్కో ఇన్స్టిట్యూట్ నుండి ప్రతీ ఏడాది 100 కు పైగా విద్యార్థులు కంపస్ ఇంటర్వ్యూ లో ఎంపికై ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. ఐటిఐ విద్యా, ఉద్యోగ వకాశాలు ఉపయోగించుకోవాలని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ పైల జవహర్ వెల్లడించారు.






## పారిశుధ్య పనుల పరిశీలన

**పలాస, మే 21(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలోని పలు వార్డులలో మున్సిపల్ కమ్యూషనర్ నడిపేనా రామారావు బుధవారం పారిశుధ్య పనులను పరుశీలించారు కాశీబుగ్గ 17వ వార్డు ఎం పి డి ఓ ఆఫీస్ రోడ్ లో స్వీపింగ్ ప్రక్రియను పరిశీలించారు. కాశీబుగ్గ 13 వ వార్డు, వెజిటబుల్ డైలీ మార్కెట్ లో చిరు వ్యాపారస్తులకు శానిటేషన్ పై అవగాహన కల్పించారు. కాశీబుగ్గ, 14వ వార్డు, కె టి రోడ్లో శానిటేషన్ ను పరిశీలించి, కాశీబుగ్గ రైల్వే క్వార్టర్స్ 9వ వార్డ్ వెంకటేశ్వర కాలనీ లో శానిటేషన్ పరిస్థితిని పరిశీలించారు. పలాసలో 28వ వార్డు, ఉదయపురం గొడగల వీధిలో డ్రైనేజ్ పరిస్థితిని పరిశీలించి, సిల్ట్ లను తక్షణమే తొలగించవలసిందిగా పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు 4వ వార్డు పద్మనాభపురం కాలనీలో 4వ లైన్ లో డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్ పై సిబ్బందికి ఆయన సూచనలు ఇచ్చారు. కాశీబుగ్గ ఓల్డ్ బస్టాండ్ రోడ్ లో గల అన్న క్యాంటీన్, తనిఖీ లలో భాగంగా బ్రేక్ ఫాస్ట్ టైం లో తనిఖీ చేశారు. టిఫిన్స్, ప్యూరిఫై డ్రింకింగ్ వాటర్ గానీ, క్వాలిటీ,క్వాంటిటీ, వెలుపల-బయట శానిటేషన్ బాగున్నాయని పబ్లిక్ నుంచి మంచి స్పందన లభించిదన్నారు.

## 27న శ్రీకాకుళ అమరవీరుల సభ



**పలాస, మే 21(వార్త):** శ్రీకాకుళం అమరవీరుల జ్ఞాపకార్థం వివిధ విప్లవ సంస్థలు, బొడ్డపాడు పరిసర ప్రాంత ప్రజలు ఇతర రాష్ట్రాల ప్రజల సహకారంతో అమరవీరుల స్మారక భవనం నిర్మించామని, ఈ నెల 27న దాన్ని ఆవిష్కరించను న్నామని నిర్వాహక కమిటీ తెలిపింది. బుధవారం బొడ్డపాడులో ఈ సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్మారక కమిటీ కన్వీనర్ జోగి కోదండరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, లిబరేషన్ నాయకులు దుశ్యాంత్ , మద్దిల. రామారావు, పిడిఎం రాష్ట్ర నాయకులు సాలిని వీరాస్వామి, పికేఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మద్దిల. ధర్మారావు , పుచ్చ దుర్యోధన, ఏఐకేఎంఎస్ నాయకులు గోరకల బాలకృష్ణ, అమరుల బంధుమిత్రుల సంఘం నాయకులు తామాడ త్రిలోచనారావు, మురిపింటి గంగయ్య, సారా జగన్, దాసరి శ్రీరాములు, మోహిని, అప్పయ్య, బాలరాజు పోతనపల్లి అప్పారావు, ఆర్ మాధవరావు, రాపాక ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మెగా ఉద్యోగ మేళాకు అపూర్వ స్పందన



**ఎచ్చెర్ల, మే 21(వార్త):** రణస్థలంలో ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రాంగణంలో బుధవారం మెగా ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ మేళాలో 21 ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు పాల్గొని, అక్కడికక్కడే ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 781 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా, వారిలో 302 మందికి ఉద్యోగాలు లభించాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, ఎచ్చెర్ల శాసన సభ్యులు ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ "ఇటీవల వరకు ఉద్యోగాల కోసం యువత కంపెనీల చుట్టూ తిరిగేది. ఇప్పుడు ప్రభుత్వాల చొరవతో కంపెనీలే మన దాకా వస్తున్నాయి. ప్రతి యువతి, యువకుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు. సాయి కుమార్ మాట్లాడుతూ"ఏ ఉద్యోగమైనా చిన్నదీ పెద్దదీ అనే భేదం లేకుండా ముందుకు సాగాలని కోరుతున్నాం. తొలుత ఉద్యోగం చేపట్టి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలి" అని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి సుధ, సెట్శ్రీ సీఈవో ప్రసాదరావు, ఎడి డిసేబుల్డ్ కవిత, ఎన్ఈఆర్ డైరెక్టర్ తేజ, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, ఎన్ఈఆర్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546